క్లుప్తంగా

వేసవి ఎండలతో ప్రజలకు ఇక్కట్లు



గుల్లేపల్లిలో మధ్యాహ్న సమయంలో ఎండ తీవ్రతకు నిర్మానుష్యంగా రోడ్డు

కె.కోటపాడు : వేసవి ఉష్ణోగ్రతలు వారం రోజులుగా అధికంగా నమోదు అవుతున్నాయి. ఉదయం 10 నుండి మధ్యాహ్నం 4 గంటల వరకు రోడ్లపైకి రావాలంటేనే ప్రజలు ఆందోళన చెందుతున్నారు. శనివారం వేసవి ఉష్ణోగ్రతలు ఎక్కువగా మండలంలో నమోదు కావడంతో ప్రధాన మార్గాలలో గల రోడ్లన్నీ జనసంచారం లేక నిర్మానుష్యంగా మారాయి. అధిక ఉష్ణోగ్రతలకు వడదెబ్బకు గురికాకుండా ప్రజలు ఆరోగ్య జాగ్రత్తలను ప్రజలు పాటించాలని లంకవానిపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారి శైలజ సూచించారు.

నూతన ఎంపీడీవో బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు చేపట్టిన ఎంపీడీవో ఛాయాసుధ

మాకవరపాలెం : నూతన ఎంపీడీవో పి.ఛాయాసుధ బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎంపీడీవోగా పనిచేస్తున్న అరుణశ్రీ సుమారు ఏడాది క్రితం బదిలీ అయ్యారు. అనంతరం ఈవోపీఆర్‌డీ సీతామహాలక్ష్మి ఇన్‌చార్జ్ ఎంపీడీవోగా ఉన్నారు. జీసీసీలో పనిచేస్తున్న ఛాయాసుధ పదోన్నతిపై మాకవరపాలెం ఎంపీడీవోగా నియమితులై, శనివారం విధుల్లో చేరారు. ఆమెను మండల పరిషత్ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు మర్యాదపూర్వకంగా కలసి శుభాకాంక్షలు తెలిపారు.

వైభవంగా వేంకటేశుని కల్యాణం



కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు

మాకవరపాలెం : వేంకటేశ్వస్వామి కల్యాణం వైభవంగా సాగింది. మండలంలోని తామరంలో గల వేంకటేశ్వరస్వామి ఆలయం నిర్మించి 23 ఏళ్ల పూర్తి కావడంతో శనివారం ఈ ఆలయంలో వార్షిక కల్యాణం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా భక్తులు మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండు నుంచి ఆలయం వరకు నగర సంకీర్తనగా వచ్చి అనంతరం కళ్యాణోత్సవంలో పాల్గొన్నారు. పూజల అనంతరం భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రసాదాలు పంపిణీ చేశారు. కమిటీ సభ్యులు ప్రభాకరరాజు, రఘుబాబు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మోదకొండమ్మ ఆలయ వార్షికోత్సవం



ఎ.కోడూరులో మోదకొండమ్మ అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న భక్తులు

కె.కోటపాడు : ఎ.కోడూరు గ్రామంలో గల మోదకొండమ్మ అమ్మవారి ఆలయ 12వ వార్షికోత్సవాన్ని గ్రామస్తులు శనివారం ఘనంగా జరిపారు. అమ్మవారి ఆలయ వార్షికోత్సవం పర్వదినం కావడంతో గ్రామస్తులు పెద్ద సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు. అమ్మవారికి పూజా కార్యక్రమాల్లో భాగంగా అష్టోత్తర కలశాభిషేకం, మహిళలతో సామూహిక కుంకుమార్చనలు జరిపారు. అనంతరం అన్న సమారాధన జరిపారు. గ్రామస్తులతో పాటు సమీప గ్రామాల ప్రజలు అమ్మవారి ప్రసాదం స్వీకరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, యువకులు పాల్గొన్నారు.

శరవేగంగా వీరాంజనేయ గోపుర నిర్మాణం



మాడుగుల : స్థానిక గాంధీ పార్కు వద్ద వెలసిన విజయాంజనేయ ఆలయం గోపుర నిర్మాణపనులు శరవేగంగా జరుగుతున్నాయి. దాతలు, గ్రామస్తుల సహకారంతో సుమారు రూ.5లక్షలతో గోపుర నిర్మాణంతో పాటు శ్రీరామ పట్టాభిషేక నిర్మాణాలు జరుగుతాయని, నిర్వాహకులు రాఖీ శ్రీను తెలిపారు. ఆలయాన్ని మరింత ఉన్నతంగా తీర్చిదిద్దడానికి హనుమాన్ భక్తులు, దాతలు ముందుకు వచ్చి సహకారం అందించాలని నిర్వాహకులు కోరుతున్నారు.

ప్రైవేటు విద్యా సంస్థలకు దీటుగా ప్రభుత్వ విద్య

గత ప్రభుత్వ హయాంలో సంస్కరణల ఫలితం

విద్యారంగానికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పెద్ద పీట

టెన్త్‌లో మండల టాపర్, శతశాతం ఫలితాలు సాధించిన రోలుగుంట కేజీబీవీ

ఇంటర్‌లో స్టేట్‌ఫస్ట్ దక్కించుకున్న రోలుగుంట జూనియర్ కళాశాల



రోలుగుంట జూనియర్ కళాశాల భవనం

నాటి సంస్కరణలు.. నేడు సత్ఫలితాలు



రోలుగుంట కేజీబీవీ పాఠశాల భవనం

రోలుగుంట : గత ప్రభుత్వం(వైఎస్సార్‌సీపీ) పేదోడికి సైతం ఉన్నత విద్య అందుబాటులోకి వచ్చే విధంగా తీసుకొచ్చిన విద్యా సంస్కరణలు ఏటా పరీక్ష ఫలితాల్లో ప్రతిబింబిస్తున్నాయి. ప్రభుత్వ ఆధీనంలో ఉన్న(నడుస్తున్న) పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులు సాధిస్తున్న ఫలితాలు నాడు పెదవి విరిచి వారే ముక్కున వేలేసుకునేలా చేస్తున్నాయంటే అతిశయోక్తి కాదు. మారుమూల పల్లెల్లో గల ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు సైతం పరీక్షల్లో తమ సత్తా ఏమిటో చూపిస్తున్నారు. అలాగే కళాశాల దశలో రాష్ట్ర స్థాయి ర్యాంకులు, పాఠశాల దశలో జిల్లా మండలస్థాయి ర్యాంకులు కొల్లగొట్టడం ప్రభుత్వ విద్యా సంస్థల్లోని విద్యార్థులకు సునాయాసమైంది. ప్రభుత్వం తీసుకున్న శ్రద్ధ, పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన సత్ఫలితాల దిశగా అడుగులు వేయిస్తోంది.

క్రమశిక్షణతో కూడిన విద్య



ప్రైవేటు కన్నా ప్రభుత్వ పాఠశాలల్లో క్రమశిక్షణతో కూడిన విద్య ఉంటుంది. రైతు కుటుంబానికి చెందిన నేను కేజీబీవీలో చదవడం వల్లనే ఇటీవల వెలువడిన పదో తరగతి పరీక్ష ఫలితాల్లో 578 మార్కులు తెచ్చుకొని మండల టాపర్‌గా నిలవడం సాధ్యమైంది.

– లగుడు హర్షిత, విద్యార్థిని, జానకీరాంపురం

ప్రభుత్వ పాఠశాలల్లోనే నిష్ణాతులైన గురువులు

ప్రైవేటు కళాశాలల్లో శిక్షణతో పని లేకుండా కరస్పాండెంటు తన ఇష్టమైన వారితో క్లాసులు నడుపుతారు. ప్రభుత్వ పాఠశాల, కళాశాలల్లో అయితే శిక్షణ పూర్తి చేసుకొని మెరిట్ ప్రాతిపదికన ఎంపికై ఉద్యోగం తెచ్చుకుంటారు. అదే మాదిరిగా వారి బోధనాశైలి ఉంటుంది. అందుకే ప్రతిభకు తగ్గ ఫలితం ఉంటుంది.

– మడ్డు గౌతమి (ఇంటర్‌లో 986 మార్కులు సాధించిన విద్యార్థిని)

రోలుగుంట కేజీబీవీలో సాధించిన ఫలితాలు

కేజీబీవీ నుంచి 31 మంది టెన్త్ పరీక్షల్లో పాల్గొని 31 మంది ఉత్తీర్ణత చెందడంతో శతశాతం ఫలితాలొచ్చాయి. మండలంలో ఎనిమిది ప్రభుత్వ జెడ్పీ ఉన్నత పాఠశాలలు, కేజీబీవీతో కలిపి తొమ్మిది పాఠశాలల్లో టెన్త్ ఉత్తీర్ణత చెందిన వారిలో కేజీబీవీ విద్యార్థిని 578 మార్కులు సాధించి మండల టాపర్‌గా నిలిచింది.

జూనియర్ కళాశాలలో ఎంపీసీ గ్రూపు నుంచి మడ్డు గౌతమి అత్యధికంగా 986 మార్కులు ఎంపీసీ గ్రూపు నుంచి సాధించి స్టేట్ ఫస్ట్ దక్కించుకుంది. ఇదే కళాశాల నుంచి గతేడాది గణిత అధ్యాపకుడు రాష్ట్ర ఉత్తమ అధ్యాపకుడిగా జిల్లా నుంచి అవార్డు అందుకున్నారు. ఇందుకు గత ప్రభుత్వం తీసుకొచ్చిన విద్యా సంస్కరణల ఫలితమేనని పలువురు విద్యార్థులు, వారి తల్లిదండ్రులు చెబుతున్నారు. అలాగే ఈ విద్యాసంస్కరణలు కొనసాగించి ప్రభుత్వ విద్యారంగాన్ని మరింత పటిష్టవంతం చేయాలని పలువురు కోరుతున్నారు.

సమష్టి కృషితోనే శతశాతం ఫలితాలు



ఉపాధ్యాయ సిబ్బంది సమష్టి కృషి ద్వారానే శత శాతం ఫలితాలు సాధ్యపడ్డాయి. అలాగే మండల టాపర్ కూడా మా పాఠశాల విద్యార్థి కావడం గర్వంగా ఉంది. మంచి వసతి, భోజన సరఫరాలో మెనూ పాటించి, సబ్జెక్టు వైజు బోధన అందించి ఆశించిన ఫలితాలు రాబట్టడమే లక్ష్యం.

– తులసి, ఎస్‌వో, కేజీబీవీ రోలుగుంట

విద్యార్థుల్లో ఆశించిన ఫలితాలు



శక్తించన లేకుండా విద్యార్థులకు మేలైన బోధన అందించడంతో పాటు విద్యార్థి కష్టపడి, ఇష్టపడి చదవడం ద్వారా మంచి ఫలితాలు సాధించడం సాధ్యమవుతుంది. ఇదే లక్ష్యంతో పనిచేసి కళాశాలలో ఉత్తమ ఫలితాలు సాధించాం.

– బి.సహదేవుడు, గణిత అధ్యాపకుడు, రోలుగుంట జూనియర్ కళాశాల

అంగన్‌వాడీ కేంద్రాల్లో అమ్మకు వందనం కార్యక్రమం



నాతవరం-1 అంగన్‌వాడీ కేంద్రంలో అమ్మకు పాదాభివందనం నిర్వహిస్తున్న కార్యకర్తలు

నాతవరం : అంగన్‌వాడీ కేంద్రాలను అన్ని విధాలుగా అభివృద్ధి చేయడంలో భాగంగా పలు కార్యక్రమాలు చేయడం జరుగుతుందని గొలుగొండ ఐసీడీఎస్ ప్రాజెక్ట్ అధికారి శ్రీగౌరి అన్నారు. ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో శనివారం అమ్మకు పాదాభివందనం కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలు అంగన్‌వాడీ కేంద్రాల్లో నిర్వహించడం వల్ల చిన్నారులకు విద్యతో పాటు సామాజిక స్ఫూర్తి అలవడుతుందన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సెక్టారు సూపర్‌వైజర్లు విజయలక్ష్మి, నాగజ్యోతి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

అసిస్టెంట్ సర్వేయర్ కోర్సుకు దరఖాస్తులు

మాకవరపాలెం: అసిస్టెంట్ సర్వేయర్ కోర్సులో ఉచిత శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని నేషనల్ అకాడమి ఆఫ్ కన్‌స్ట్రక్షన్ (నాక్)అసిస్టెంట్ డైరెక్టర్ రవికుమార్ తెలిపారు. రెండు నెలల పాటు మండల కేంద్రంలో ఉన్న నాక్ శిక్షణ కేంద్రంలో శిక్షణ ఇస్తామన్నారు. 18 నుంచి 44 ఏళ్లలోపు ఉండి, ఇంటర్ ఆపైన చదువుకున్న వారు అర్హులన్నారు. ఇతర వివరాలకు 7780374625 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

ఎస్సీ సంక్షేమ పథకాలు తక్షణం పునరుద్ధరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న అంబేద్కర్ ఆశయ సాధన సంఘం మండల అధ్యక్షుడు కాటపల్లి అప్పారావు

దేవరాపల్లి: ఎస్సీ సంక్షేమ పథకాలను పునరుద్ధరించి తక్షణం అమలు చేయాలని మండల అంబేడ్కర్ ఆశయ సాధన సంఘం డిమాండ్ చేసింది. మండల కేంద్రం దేవరాపల్లిలోని రైవాడ అతిథి గృహం వద్ద శనివారం మండల సంఘ సభ్యుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా అంబేద్కర్ ఆశయ సాధన సంఘం మండల అధ్యక్షుడు కాటపల్లి అప్పారావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఎస్సీ సంక్షేమ పథకాలను పునరుద్ధరించి అమలు చేస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం కచ్చితంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. అర్హులైన ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు మంజూరు చేయడంతో పాటు దళిత కాలనీల అభివృద్ధికి సబ్‌ప్లాన్ నిధులు వెచ్చించాలన్నారు. దేవరాపల్లిలో అంబేడ్కర్ భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో మండల సంఘం సభ్యులు సబ్బవరపు దేముడు, తాడి అప్పారావు, తెరపల్లి శ్రీరామ్, తాడి ఎర్నిబాబు, సబ్బవరపు కొండలరావు, మల్లవరపు దేముడు పాల్గొన్నారు.

బోయిలకింతాడలో ఉచిత మెగా వైద్య శిబిరం రేపు

దేవరాపల్లి : బోయిలకింతాడ గ్రామంలో సోమవారం ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు. సంగివలసలోని అనిల్ నీరుకొండ ఆస్పత్రి వారి సౌజన్యంతో కేజేపురం భానోదయ స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపక చైర్మన్ రాపేటి రామకొండలరావు మాస్టారు, అన్నం రామునాయుడు ప్రోత్సాహంతో ఈ మెగా వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్టు వారు స్పష్టం చేశారు. సోమవారం ఉదయం 8:30 గంటల నుంచి ప్రారంభమయ్యే వైద్య శిబిరంలో అన్ని రకాల అనారోగ్య సమస్యలకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితం మందులు అందజేయడంతో పాటు అవసరమైన వారికి ఆరోగ్యశ్రీలో ఆపరేషన్లు సైతం నిర్వహిస్తారన్నారు.

అనారోగ్యంతో బాధపడుతున్న విద్యార్థికి వితరణ



ఆస్పత్రిలో విద్యార్థిని పరామర్శిస్తున్న కొత్తకోట గ్రౌండ్ బాయ్స్ సేవా సంఘం సభ్యులు

రావికమతం: మండలంలో కన్నంపేట గ్రామానికి చెందిన విద్యార్థి సియాద్రి మణికంఠ ఇటీవల అనారోగ్య సమస్యతో విశాఖపట్నం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ విషయమై శనివారం 'సాక్షి'లో వచ్చిన వార్తకు స్పందించిన కొత్తకోటకు చెందిన గ్రౌండ్ బాయ్స్ సేవా సంఘం సభ్యులు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆ విద్యార్థిని పరామర్శించారు. రూ.15 వేలు ఆర్థిక సహాయం శనివారం అతని కుటుంబ సభ్యులకు అందజేశారు. విద్యార్థికి నగదుతో పాటు అవసరమైన రక్తం సిద్ధం చేశామని సంఘ సభ్యులు శేషు తదితరులు తెలిపారు.

ప్రకృతి వ్యవసాయం మేలు

నర్సీపట్నం : ప్రకృతి వ్యవసాయం రైతులకు మేలు చేకూరుతుందని సర్పంచ్ నిద్ర శ్రీనివాసరావు పేర్కొన్నారు. నర్సీపట్నం మండలం, దుగ్గాడ పంచాయతీ పరిధి శ్రీరాంపురంలో శనివారం ప్రకృతి వ్యవసాయంపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. సర్పంచ్ మాట్లాడుతూ ఈ ఖరీఫ్‌లో రైతులకు అవసరమైన విత్తనాలు, నవధాన్యాలను సంబంధిత అధికారులు సరఫరా చేస్తారన్నారు. ప్రకృతి వ్యవసాయం చేస్తున్న ఉత్తమ రైతులను సన్మానించారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ నిర్వాహకులు ఎల్.రమ, ఐసీఆర్‌పీ రామ సత్యవతి పాల్గొన్నారు.

కర్షక, కార్మిక హక్కుల కోసం దేశవ్యాప్త సమ్మె



సమావేశంలో మాట్లాడుతున్న శంకరరావు



రావిమతంలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న సీఐటీయు నాయకులు

కె.కోటపాడు : కార్మికుల, కర్షకుల సమస్యల పరిష్కారానికి ఈ నెల 20న చేపడుతున్న సమ్మెను అన్ని వర్గాల వారు విజయవంతం చేయాలని అనకాపల్లి జిల్లా సీఐటీయూ ప్రధాన కార్యదర్శి శంకరరావు కోరారు. కె.కోటపాడు సీఐటీయూ కార్యాలయంలో శనివారం వివిధ వర్గాల వారితో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శంకరరావు మాట్లాడుతూ వివిధ రంగాల్లో పని చేస్తున్న కార్మికులకు కనీస వేతనం రూ.26వేలను అందించాలని, రైతుల పండించే పంటలకు మేలైన మద్దతు ధరను ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి గండి నాయిని బాబు మాట్లాడుతూ రైతులకు గిట్టుబాటు ధర లేకుండా పండించిన పంటను ఆన్‌లైన్‌లో అమ్మకాలు చేసే విధంగా చట్టాలు తీసుకువస్తున్నారని ఆయన విమర్శించారు. వివిధ వర్గాలకు నష్టం కలిగించే చర్యలను వ్యతిరేకిస్తూ చేపడుతున్న సమ్మె కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి రొంగలి ముత్యాలనాయుడు, ఈర్లె నాయుడుబాబు, యర్రా దేముడు పాల్గొన్నారు.

రావికమతం: కేంద్రం ప్రభుత్వం అమలు చేస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా సీఐటీయూ ఆధ్వర్యంలో ఈ నెల 20న జరిగే దేశ వ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయు రాష్ట్ర కార్యదర్శి సత్యవతి కోరారు. రావికమతంలో శనివారం మండల సమన్వయ కమిటీ సమావేశంలో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక వర్గానికి తీవ్ర నష్టం కలిగించే లేబర్‌కోడ్స్ తెచ్చిందన్నారు. ఈ లేబర్‌కోడ్స్ రద్దు కోరుతూ ఈ సమ్మె నిర్వహిస్తున్నట్టు సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు కె. గోవిందరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐటీయు రాష్ట్ర కార్యదర్శి సత్యవతి, సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు గోవిందరావు, ముఠా కార్మిక సంఘం అధ్యక్షుడు కరణం రమణ, పంచాయతీ వర్కర్స్ యూనియన్ నాయకుడు శేషుబాబు పాల్గొన్నారు.

మోదకొండమ్మకు 271 తులాల వెండితో కవచం

వచ్చే నెల 3న అమ్మవారి పండగకు ఏర్పాట్లు



వెండి బంగారు ఆభరణాలతో మోదకొండమ్మను అలంకరించిన దృశ్యం

మాడుగుల : ఉత్తరాంధ్ర ఇలవేల్పు మాడుగుల మోదకొండమ్మ నెల రోజుల పండగలో భాగంగా 271 తులాల వెండితో వెండి కవచం, 8 తులాలతో బంగారంతో శతమానాలతో పాటు వేలాది రూపాయలు విలువ గల పట్టుచీరతో అమ్మవారిని అలంకరించారు. దీంతో పెద్ద ఎత్తున్న భక్తులు శనివారం అమ్మవారిని దర్శించుకున్నారు. వచ్చే నెల 3వ తేదీన జరగనున్న పండగకు ఇప్పటికే ఏర్పాట్లు సిద్ధం చేస్తున్నారు. దూర ప్రాంతాల నుంచి పండగకు వచ్చే భక్తులకు గ్రామస్తులు, గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు ఆదరించడంతో పాటు పండగ విజయవంతం చేయడానికి గ్రామంలో ఉన్న ప్రతి ఒక్కరూ సహకరించాలని, ఆలయ కమిటీ చైర్మన్ పుప్పాల అప్పలరాజు కోరారు.



టోల్‌గేట్ వద్ద విక్రయిస్తున్న పుచ్చకాయలు



సైకిల్ పై కొబ్బరి బొండాలు విక్రయిస్తున్న దృశ్యం

హాట్ సమ్మర్.. కూల్ బిజినెస్..

హైవేపై జోరుగా కొబ్బరి బొండాలు, పుచ్చకాయల వ్యాపారం

పండ్ల రసాలు, శీతలపానీయాలకు గిరాకీ

నక్కపల్లి : ఈ ఏడాది ఎండలు మండిపోతున్నాయి. ఉదయం 9 గంటలు దాటితే సూరీడు చుర్రుమనిపిస్తున్నాడు. రానున్న రోజుల్లో ఎండలు ఏ మేరకు మండిపోతాయో తలచుకుంటే గుబులు పుడుతోంది. దాహార్తి తీర్చుకోడానికి ఎక్కువ మంది శీతలపానీయాలతో పాటు కొబ్బరి బొండాలు, పుచ్చకాయలపై ఆధారపడుతున్నారు. దీంతో ముఖ్యంగా జాతీయరహదారిపై కొబ్బరి బొండాలు, పుచ్చకాయల విక్రయాలు జోరందుకున్నాయి.వేంపాడు టోల్‌గేట్ వద్ద వివిధ ప్రాంతాల నుంచి తెచ్చి కొబ్బరిబొండాలు, పుచ్చకాయలను విక్రయిస్తూ పలువురు ఉపాధి పొందుతున్నారు. రోజూ వేలల్లో వ్యాపారం సాగుతోంది.

పుచ్చకాయలు...

వివిధ ప్రాంతాలనుంచి పుచ్చకాయలను దిగుమతి చేసుకొని ఇక్కడ విక్రయిస్తున్నారు. నక్కపల్లి టోల్‌గేట్ ప్రాంతంలో నిత్యం భారీగా అమ్మకాలు సాగిస్తున్నారు. పాయకరావుపేట పట్టణంలో ట్రాన్స్‌కో కార్యాలయం, పంచాయతీ కార్యాలయాలు, జాతీయరహదారిపై తాండవ జంక్షన్ పరిసరాల్లో కూడా పుచ్చకాయల వ్యాపారం జోరుగా సాగుతోంది. గతంలో పరిమాణం బట్టి రూ.30 నుంచి రూ.50ల వరకు పుచ్చకాయలను విక్రయించేవారు. పుచ్చకాయలకు డిమాండ్ ఎక్కువగా ఉండటంతో వీటిని కూడా కిలోల లెక్కన విక్రయించడం మొదలు పెట్టారు. కిలో రూ.30లకు విక్రయిస్తున్నారు. ఒక్కో పుచ్చకాయ రూ.70నుంచి రూ.100 వరకూ పలుకుతోంది. పుచ్చకాయలను ముక్కలుగా కూడా అమ్ముతున్నారు.వాహనాలపై రాకపోకలు సాగించేవారికి,బస్సుల్లో ప్రయాణించేవారివద్దకు తీసుకెళ్లివిక్రయిస్తున్నారు.వేసవి సమయంలో పుచ్చకాయలు, కొబ్బరి బొండాల నీరు ఆరోగ్యానికి ఎంతో మంచిదని వైద్యులు చెపుతుండంతో అమ్మకాలు జోరందుకున్నాయి. పాన్‌షాపుల్లో కూడా పుచ్చకాయలను జ్యూస్‌గా చేసి గ్లాసు రూ.20కి విక్రయిస్తున్నా రు. పాయకరావుపేట టౌన్, వేంపాడు టోల్‌గేట్, అడ్డు రోడ్డులలో షాపుల్లో రోజుకు కనీసం వేయి కిలోల వరకు పుచ్చకాయల ను విక్రయిస్తున్నారు.

కొబ్బరి బొండాలు...

కొబ్బరి బొండాలకు ఎప్పు డూ గిరాకీ ఎక్కువే. వేసవి కాల మైతే మరీ డిమాండ్ ఉంటుంది. ఒక్కో బొండాం రూ.30లకు విక్రయిస్తున్నారు. సైకిళ్లు,తోపుడుబళ్లపై పెట్టుకొని అమ్ముతున్నారు. జాతీయ రహదారిపై నక్కపల్లి, వేంపాడు, చినదొడ్డిగల్లు, అడ్డురోడ్డు జంక్షన్, పాయకరావుపేట వద్ద రోజుకు కనీసం ఐదు వందల బొండాల వరకూ అమ్మకాలు సాగుతున్నాయని వ్యాపారులు తెలిపారు.

పళ్లరసాలు...

అరటి,ద్రాక్ష,బొప్పాయి,కర్బుజా,బత్తాయి,సపోటా తదితర పళ్లరసాలకు డిమాండ్ ఎక్కువగా ఉంది. పాన్‌షాపుల్లో వివిధ రకాల జ్యూస్‌లను గ్లాసు రూ.30లకు విక్రయిస్తున్నారు. పట్టణప్రాంతాల్లో అయితే వీటి ధరమరింత ప్రియం. వీటి డిమాండ్‌కు తగ్గట్టుగానే వ్యాపారులు కూడా సరుకులను ముందుగానే హోల్‌సేల్‌గా కొనుగోలు చేసి ఉంచుకున్నారు. విద్యుత్ కోతల కారణంగా జనరేటర్లుకూడా వినియోగిస్తున్నారు.

చెరకు రసానికీ డిమాండ్..

ఈప్రాంతంలో చెరకు సాగు లేనప్పటికీ చెరకు రసాలను విక్రయించే దుకాణాలు కూడా ఎక్కడికక్కడ వెలిశాయి. వేరే ప్రాంతాల నుంచి చెరకు గడలను కొనుగోలు చేసి తెచ్చి చెరకు రసాన్ని విక్రయిస్తున్నారు. పాయకరావుపేట పట్టణంలో వైజంక్షన్, సూర్యామహల్ జంక్షన్‌లలో పట్టణ వాసుల కోసం చెరకు రసం దుకాణాలు ఏర్పాటు చేశారు. గ్లాసు చెరకు రసం రూ.20లకు విక్రయిస్తున్నారు. మంచిపోషకవిలువలు అందించే చెరకు రసం తాగడం ఆరోగ్యానికి ఎంతో మేలని వైద్యులు కూడా చెబుతున్నారు.

పండ్ల రసాల సేల్స్ ఎక్కువ



వేసవి కారణంగా ఎక్కువ మంది పండ్ల రసాలను తాగుతున్నారు. చిన్నపిల్లలతో రాకపోకలు సాగించేవారు, వివిధ పనుల కోసం మండల కేంద్రాలకు వచ్చే వారు ఎక్కువగా వీటిని తాగుతున్నారు. దూరప్రాంతాల వారు రాకపోకలు సాగించే సమయంలో వడదెబ్బబారిన పడకుండా కొద్దిసేపు సేదతీరేందుకు మా షాపు వద్ద ఏర్పాట్లు కూడా చేశాం.

– ఎల్లేటి సత్తిబాబు, పాన్‌షాపు, యజమాని,నక్కపల్లి

ముమ్మరంగా రబీ వరి కోతలు

ఖరీఫ్ వరి నారుమడులు సిద్ధం చేస్తున్న రైతులు



గాదిరాయిలో ఖరీఫ్ వరినారుమడికి సిద్ధం చేసిన వరిపొలం

మాడుగుల రూరల్ : నీటి ఆధారం వున్న ప్రాంతంలో రబీ వరి కోతలు కోస్తున్నారు. మండలంలో పెద్దేరు జలాశయం దిగువ ఆయకట్టు పరిధిలో గల రాచకట్టు కింద వున్న రబీ వరి పంట వివిధ గ్రామాల్లో వేశారు. గత వారంలో ఆడపా దడపా కురిసిన వర్షాలకు వరి కోతలు కొన్ని చోట్ల కోసారు. కొన్ని చోట్ల వరి కోతలు వాయిదా వేసుకున్నారు. నాలుగు రోజులుగా కాస్తున్న ఎండలకు వరి కోతలు కోసే పనిలో రైతులు ఉన్నారు. సత్యవరం, కింతలి, ఒమ్మలి, జంపెన, తదితర గ్రామాల్లో రబీ వరి పంటను వేశారు. అలాగే ఖరీఫ్ వరి కోసం నారు మడులను సిద్ధం చేసే పనిలో రైతులు నిమగ్నులై ఉన్నారు. వరి నారుమడులు కోసం దుక్కులు చేస్తున్నారు. వచ్చే నెల మెదటి వారంలో వరినారు వేయనున్నారు. దీని కోసం వ్యవసాయ శాఖ వారు ఇప్పటికే అన్ని విధాలుగా ఖరీఫ్ వరి విత్తనాలు నమోదుకు త్వరలో ప్రభుత్వం ప్రకటన జారీ చేయనున్నట్టు చెబుతున్నారు.

వడదెబ్బ తగలకుండా అప్రమత్తం

రోలుగుంట : వేసవిలో అధిక ఉష్ణోగ్రతలకు వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు పాటించాలని స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి శ్రావణి తెలిపారు. పీహెచ్‌సీలో శుక్రవారం ఎండలు, వడదెబ్బ పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ముఖ్యంగా రైతు కూలీలు, ఉపాధి కూలీలు ముందు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.